# క్యాట్‌గర్ల్

దాదాపు ఎనిమిదేళ్ళ తరువాత ఈ ఫ్లాట్‌లోకి అడుగు పెడుతుంటే కాళ్ళలో, కళ్ళలో కలవరం. గుండెల్లో అలలుగా దిగులు. బేస్‌మెంట్‌ని చూడగానే జ్ఞాపకాల జావళి.

◆◆◆

అతనిని మొదటిసారి చూసినప్పుడు ఏం అనిపించలేదు. అతను బేస్‌మెంట్‌లో కవాసాకి పార్క్ చేసి మా ఫ్లాట్ ముందు నుండే వాళ్ళ ఫ్లాట్‌కి వెళ్ళాలి. అతను అటూఇటూ ఎటూ చూడకుండా తన ఫ్లాట్‌కి వెళ్ళి పోతుండేవాడు. ఆ పట్టించుకోని తనం నన్నెంతగానో ఆకర్షించింది. చాల పొద్దు పోయేవరకు చదువుకోవటం అలవాటేమో పొద్దు పోయి ఇంటికి వచ్చే అతనిని క్రమం తప్పకుండా చూడటం అలవాటయి దారికాసినట్టే అతని కోసం రోజూ మేల్కొని ఉండేదాన్ని.

అతని పేరేంటో? చదువుకుంటున్నాడా? ఇంత రాత్రి వరకు ఎక్కడ తిరిగి వస్తాడో? డిస్కోలకి వెళతాడా? సినిమాలకా? గర్ల్‌ఫ్రెండ్స్ ఉన్నారా?

తేనె రంగు కళ్ళు, మెరిసే చెంపలు, పల్చని గెడ్డం - చూస్తున్న కొద్దీ చూడాలనిపించే సోయగం. ముఖ్యంగా అధరాల వర్ణం - వంపు.

అతను మెల్లగా నా ఉనికిని గమనించాడు. చూపులు, చిరునవ్వులు.

"మీ పేరేంటి" చిన్నగా పలకరించాను, బండి పార్క్ చేసి ఫ్లాట్ వేపు వస్తున్న అతనిని.

"శ్యామ్"

మౌనం.

అరక్షణం తరువాత కళ్ళనిండా ఇష్టం కదులుతుండగా, "క్యూట్ గర్ల్" అని క్షణం ఆగి, "పేరేంటి;" చిరునవ్వుతో అడిగాడు.

"మైత్రి"

తిరిగి మౌనం. ఆ మౌనం మూడు రోజులలో కరిగిపోయింది.

బండి లాక్ చేసి అతను రాబోతుంటే మా ఫ్లాట్ తలుపు బయట నుండి తాళం వేసి అతని దగ్గరికి వెళ్ళి, "లాంగ్ డ్రైవ్‌కి తీసుకువెళ్ళవా?" అడిగాను.

"ఇప్పుడా?" చేతి గడియారం వేపు చూస్తూ అన్నాడు.

"ఊఁ ఇప్పుడే?"

రాత్రి పన్నెండున్నర అయిందని, నేను నైటీలోనే వున్నానని, ఏదో ఒక కారణంగా నిద్రలేచిన ఇంట్లో వాళ్ళు నేను లేనని గమనిస్తే పెద్ద గొడవ అవ్వొచ్చని తెలుసు. అయినా అతని సమక్షంలో కాసేపైనా ఉండకపోతే హృదయానికి శాంతి లేదు.

తొణక్కుండా ఏ విధమైన సడన్ బ్రేక్స్ లేకుండా అతను ఎంత నైపుణ్యంగా డ్రైవ్ చేస్తున్నాడు! నగర పొలిమేరలు దాటి కాస్త ముందుకు వెళ్ళాక ఒక చేత్తో డ్రైవ్ చేస్తూ, మరో చేత్తో ముఖాన్ని దగ్గరికి తీసుకొని బుగ్గపై ముద్దు పెట్టుకున్నాడు.

అనురాగం మనోతీగలపై మెల్లగా శృతి చేసుకుంటూ తనువు మోహపు మోహన రాగమయింది. అలా ఎన్నో సాయంత్రాలు, రాత్రులు, వెన్నెల, వర్షం, చలి, నక్షత్రాలు, మల్లెలని ఆస్వాదిస్తూ గుబాళించాయి!

బావతో నా పెళ్ళి విషయం ఇంట్లో వాళ్ళు మాట్లాడాలని నిశ్చయించుకున్న రోజు నాన్నగారి గదిలోకి వెళ్ళాను. వాలుకుర్చీలో పడుకొని పేపరు చూస్తున్నారు.

"నాన్నగారూ!" మెల్లగా పిలిచాను.

"ఏమ్మా?"

"బావని పెళ్ళి చేసుకోను"

ఆయన పేపరు మడిచి పక్కన పెట్టి, "ఇలా కూర్చో" అంటూ, "సరస్వతీ!" అని పిలిచారు. నేను కూర్చుంటుండగా అమ్మ వచ్చింది.

అమ్మని కూర్చోమని, "ఆఁ ఇప్పుడు చెప్పు" అన్నారు నాన్నగారు.

"బావని పెళ్ళి చేసుకోను"

"ఏం? ఎందుకని? బావకి ఏం తక్కువ? ఎంచక్కా ఉంటాడు. డాక్టరు. మంచి సంపాదన. ఒక్కడే కొడుకు. ఆడబిడ్డ, తోటికోడళ్ళ గొడవ ఉండదు" కంగారుగా చెప్పింది అమ్మ.

"చెప్పు ఎందుకు చేసుకోవు?" మృదువుగా అడిగారు నాన్నగారు.

"ఇష్టం లేదు"

"ఎందుకని"

"తెలియదు"

"ఎవరంటే ఇష్టం"

"శ్యామ్"

"శ్యా.....మ్...ఎవరు?" అయోమయంగా అడిగింది అమ్మ.

"ఫ్లాట్ నెంబర్ 20లో వుంటారు" అన్నాను.

"వైదేహిగారి అబ్బాయా?"

"ఏమో! నాకు తెలియదు"

"మీ ఇద్దరికి పరిచయం ఉందా? నువ్వంటే ఇష్టమేనా?"అడిగింది అమ్మ.

"ఇష్టమే!"

"పెళ్ళి చేసుకునేంత?" అడిగింది అమ్మ.

పెళ్ళి చేసుకునేంత ఇష్టం..విచిత్రంగా అనిపించింది అమ్మ ప్రశ్న. అయినా "ఆఁ" అనేశాను.

"మీరిద్దరూ పెళ్ళి గురించి మాట్లాడుకున్నారా?" అడిగింది అమ్మ.

"లేదు"

"శ్యామ్ తప్పకుండా చేసుకుంటాడని ఎలా అనుకున్నావ్?" అడిగింది అమ్మ.

"ఇష్టం కదా! తప్పకుండా చేసుకుంటాడు" అన్నాను.

"ఇష్టం వున్నవాళ్ళంతా పెళ్ళి చేసుకుంటారని అనుకోవద్దు. రకరకాల కారణాల వల్ల చేసుకోలేకపోవచ్చు. నీకు చేసుకోవాలని ఉంది. ఆ అబ్బాయికి ఉందో లేదో కనుక్కో" అని ఆగి, "వో వ్యక్తి గురించి ఏం తెలియకుండా మనసంతా నింపుకొని వో అందమైన జీవితాన్ని కళ్ళ ముందు నిలుపుకుంటే అది నిజం కాకపోతే తట్టుకోవటం కష్టం. ముందు పరీక్షలు బాగారాయి. అదే పనిగా శ్యామ్ విషయం ఏమవుతుందాని ఆలోచించకు" అంది అమ్మ.

అక్కడ నుంచి లేచి నా గదిలోకి వచ్చేశాను. అమ్మ, నాన్నగారు శాంత స్వభావులే కాని ఇంత శాంతంగా విని సలహా ఇస్తారనుకోలేదు.

ఇది జరిగిన వారం రోజుల తరువాత శ్యామ్‌తో బయటకి వెళ్ళాను. గోల్కొండ కాఫీ షాప్‌లో కూర్చుని కాఫీ ఆర్డర్ చేశాను.

"కాఫీ! ఏంటి విశేషం?" అడిగాడు శ్యామ్.

"పుట్టినరోజు"

"ఎప్పుడు పుట్టావ్?" చిన్నగా నవ్వుతూ అడిగాడు.

"ఈ రోజే"

"సంవత్సరం"

"1971"

"సెవెంటీ వన్? నిజంగా?" అడిగాడు శ్యామ్.

"ఆఁ"

"నువ్వు డిగ్రీ ఫైనలియర్ కదా" అన్నాడు.

"అవును. డిగ్రీ అయిపోయి పి.జి.లో వుండాల్సినదానినే! నాన్నగారి ట్రాన్స్‌ఫర్స్ వలన నా చదువు రెండేళ్ళు వెనకబడింది" అన్నాను.

శ్యామ్ మౌనంగా ఉండిపోయాడు. కాఫీ తాగి ఇంటికి వచ్చేశాం.

మా ఇద్దరికి పరిచయం వుందనే విషయం వైదేహిగారికి చెప్పకుండా అమ్మ పెళ్ళి మాటలని పెద్దవాళ్ళ ఆలోచనగానే ఆమెకి చెప్పాలని నిశ్చయించుకొంది. శ్యామ్ తనంతతాను ఒక అమ్మాయిని ఇష్టపడటం వాళ్ళకి ఇష్టం ఉంటుందోలేదోనని అమ్మ భయం. అమ్మకి మా పరిచయం గురించి చెప్పానని శ్యామ్‌కి చెప్పాను.

"ఏం అనలేదా?" అడిగాడు ఆశ్చర్యంగా.

"లేదు. ముందు బాగా చదువుకో అన్నారు"

"ఇంకేం! చదువుకో. నన్ను అడక్కుండా ఎందుకు చెప్పావ్?"

నేనేం జవాబు చెప్పలేదు.

కులాలు ఒక్కటే కావటం వల్లనో, అమ్మా వాళ్ళకి నేనొక్కదాన్నే అవ్వటంవల్లనో, ఆస్తి మొత్తం వస్తుందనో లేక నేను నచ్చే తెలియదు కాని వైదేహిగారు ఆనందంగా పెళ్ళి విషయం శ్యామ్‌తో మాట్లాడతానని చెప్పారు.

మూడు రోజుల తరువాత చిన్నపోయిన ముఖంతో వైదేహిగారు మరో సంబంధం చూసుకోమని అమ్మకి చెప్పారు.

"ఎందుకని?" అడిగింది అమ్మ.

"అబ్బాయి ఇష్టపడలేదు"

"ఇష్టపడలేదా?" అమ్మ ఆశ్చర్యాన్ని దాచుకోలేకపోయింది.

"అవును"

"ఏం? ఎందుకని?"

"శ్యామ్ కంటే మైత్రి మూడు నెలలు పెద్దది"

"మూడు నెలలేగా! పెద్ద తేడా కాదే! అయినా మీరు నన్ను మైత్రి వయస్సు అడగలేదే. మీకు ఎలా తెలిసింది?" అడిగింది అమ్మ.

"నిజమే! నేను అడగనేలేదు. శ్యామ్ అన్నాడు. వాడికి ఎలా తెలిసిందబ్బా?" వైదేహిగారు ఆశ్చర్యపోయారు.

"సరిగ్గా చెప్పండి-శ్యామ్ ఏమన్నాడో?" రెట్టించి అడిగింది అమ్మ.

"మైత్రి నాకంటే మూడు నెలలు పెద్దది అన్నాడు. వాడికి ఎలా తెలుసో!"

"మైత్రి, శ్యామ్ స్నేహితులు. వాళ్ళ స్నేహం విషయం తెలియగానే

మీతో మాట్లాడాను. శ్యామ్, మైత్రి స్నేహంగురించి మీతో చెప్పాడో లేదో నాకు తెలియదు. నేను మీతో చెపితే శ్యామ్ చెప్పలేదని మీరు నొచ్చుకుంటా రేమోనని నేను చెప్పలేదు. శ్యామ్ తిరస్కరిస్తే మైత్రి తట్టుకోగలదా? ఇష్టం వున్నప్పుడు మూడు నెలలగురించి పట్టించుకోవటం భావ్యమా? మరోమారు ఆలోచించండి" అంది అమ్మ.

"వయస్సు విషయంలో ఒక వేళ నాకు పట్టింపు ఉన్నా శ్యామ్ ఇష్టపడి చేసుకుంటానంటే నేను ఎలాగోలా ఒప్పుకునేదాన్నే? కాని శ్యామ్‌కి ఇష్టం లేదు. నేనేం చేయను?" అన్నారు వైదేహి.

అమ్మ మౌనంగా ఉండిపోయింది.

'శ్యామ్ అలా అనలేదేమో. ఈమెకు ఇష్టం లేదేమో' మనసులో ఆశ. శ్యామ్‌ని అడగాలి. కనిపించటం లేదు.

రెండు రోజుల తరువాత వైదేహిగారు ఇంటికి వచ్చేరు. నేను హాల్లోనే ఉన్నాను. ఆమెని పలకరించి గదిలోకి వెళ్ళబోతుంటే-

"శ్యామ్ ఢిల్లీ వెళ్ళాడు. వాడి తరహా ఏం అర్థం కావటం లేదు. నువ్వంటే ఇష్టం ఉంది. ఇష్టం ఉన్నప్పుడు పట్టింపు ఏంటంటే ఎందరో 'క్యూట్‌గర్ల్స్' నా కోసం పోటీపడుతుంటే నాకంటే పెద్దదాన్ని ఎందుకు చేసుకోవాలంటాడు. మైత్రి డిగ్రీ చదువుతుంది కదా - నా కంటే చిన్నది అనుకున్నాను. రెండేళ్ళు చదవలేదని నాకేం తెలుసు. ఈ మధ్యే తెలిసిందన్నాడు. ఇరవై, ఇరవై ఒకటికి మించిన అమ్మాయిని పెళ్ళి చేసుకోడట" అన్నారు వైదేహి.

"డోంట్ లీవ్‌మీ శ్యామ్" నిశ్శబ్దంగా బుగ్గలు తడిసిపోతున్నాయి. వెన్నెల, ఎదురుచూపులు, లాంగ్ డ్రైవ్, జాజులు - మూడు నెలల్లో కొట్టుకుపోయాయా?

"క్యూట్ గర్ల్" - శ్యామ్ తొలిసారి నాతో మాట్లాడిన మాట. వయస్సు తెలియగానే "క్యూట్‌నెస్" అంతా క్రూడ్‌గా కరిగిపోయిందా?'

చేతిలో పుస్తకంలోని పేజీలని అటు ఇటు తిప్పుతున్నాను. సూపర్ హీరోయిన్ వయస్సు ఎంత?....వాడి మొహం, ఎంత అయితే వీడికి ఎందుకో? హీరోగారికి ఏభై ఏళ్ళు ఉన్నా నోరు ఎత్తని ప్రతివాడికి హీరోయిన్

వయస్సుపై ఆరానే! వయస్సుతో నిమిత్తం లేకుండా స్త్రీని స్త్రీగా ఎందుకు చూడరో? చూడలేరో? స్త్రీ వయస్సుపై ఎన్నెన్ని ఆరాలు....ఎన్నెన్ని నిషేధాజ్ఞలు-స్వీట్ సిక్స్‌టీన్-ఇరవై ఏళ్ళు మధురం-ముప్పై దాటితే మూల కూర్చోవలసిందేనా....ప్రేమకి, వయస్సుకి సంబంధం ఏంటో? పెళ్ళికి అబ్బాయి కంటే అమ్మాయి ఖచ్చితంగా చిన్నదిగా ఉండాలని చెప్పిందెవరో... శ్యామ్... శ్యామ్- నువ్వు లేకుండా సంతోషంగా బతకలేను... నిన్ను వదిలి ఉండలేను. 'పెదవి అంచుని మంచుతో కోసి మరచిపోమన్నావు? భావ్యమా!' - ఉండుండి గుండెలలో అదిమిపెట్టి ఉంచిన దుఃఖం కరిగి వెక్కివెక్కి ఏడ్చేసేదాన్ని.

అలా ఒక రాత్రా....ఒక పగలా...రెండు నెలలు గడిచాయి.

శ్యామ్‌తో తిరిగిన పరిసరాలు, ఎదురు చూసిన సాయంత్రాలు....ఈ ఫ్లాట్‌లో ఉండటం నావల్ల కాలేదు.

రిజల్ట్స్ వచ్చాయి. విశాఖ వెళ్ళి చదువుకుంటానంటే ఇంట్లోవాళ్ళు అర్థం చేసుకొని అభ్యంతరం చెప్పలేదు.

ఆ కొండలు-అలలు నా అశాంతిని మరింత పెంచాయి. శ్యామ్ అంత తేలిగ్గా ఎలా కాదన్నాడు? ఆ అభిమానం అంతా ఉత్తిదేనా? ఛా! కాదు...శ్యామ్ ఆలోచనల నుండి విముక్తి లేకపోతే బతకలేననిపించింది. పి.జి. చదువుతూనే సివిల్ సర్వీసెస్‌కి ప్రిపేర్ అవ్వటం మొదలుపెట్టాను. కసితో చదవటం, అయినా శ్యామ్....అందమైన శ్యామ్‌కి భార్యని కాలేకపోయాననే దిగులు మాత్రంపోలేదు.

యు.పి.పి.యస్.సి.లో సెలక్ట్ అయ్యాను.

కుర్చీలో అటు కదిలినా, కారు దిగి మెట్లు ఎక్కినా, ఫైల్ మీద సంతకం చేసినా, నవ్వినా, మాట్లాడినా, ప్రతి కదలికా అందరికీ ముద్దుగా, అపురూపంగా కనిపిస్తుందని, 'అబ్బా! చిన్న వయస్సులో ఎంత మంచి ఉద్యోగం! ఎంత హోదా, ఎంత బాధ్యతా, ఎంత పరిపక్వతా' అని అందరూ అంటుంటే, 'అరే! వాళ్ళకేం తెలుసు? అపురూపమైన అందం, మంచి తెలివి తేటలు, ఎంతో నైపుణ్యంతో డ్రైవ్ చేసే శ్యామ్‌ని వయస్సు ఎక్కువ అవటం వలన కోల్పోయానని?' అనుకునేదాన్ని.

◆◆◆

శ్యామ్ తిరస్కరించాక వదిలి వెళ్ళిన ఈ ఫ్లాట్‌కి తిరిగి ఇప్పుడే రావటం.

"సొంత వూరికి కలెక్టర్ అయివచ్చావు. కాని సొంత ఇంటికి చుట్టం చూపుగానే వచ్చావు" నిష్ఠూరంగా అంది నాన్నమ్మ.

అమ్మ వడ్డిస్తుంటే మౌనంగా నాన్నమ్మ మాటలు వింటూ భోజనం చేస్తున్నా, మనసంతా శ్యామ్ మీదే ఉంది.

శ్యామ్ గురించి ఎవ్వరూ ఏం చెప్పరేంటి?

"నీ కారులో రాలేదేం" అడిగింది నాన్నమ్మ.

"అది ఆఫీసుది. సొంత ఇంటికి ఆఫీసుదాంట్లో రావటం ఇష్టం లేక ఆటోలో వచ్చాను" అన్నాను.

"సొంత పనులకి ఆ కారు వాడవా?" అడిగింది నాన్నమ్మ.

"వాడను" అంటుండగా, "అమ్మ కీస్ ఇచ్చారాండి?" అని వినిపిస్తే తల తిప్పిచూశాను. డ్రాయింగ్ కమ్ డైనింగ్‌హాల్ కదా, గుమ్మం దగ్గర స్పష్టంగా కనిపిస్తున్నాడు శ్యామ్.

శ్యామేనా?

ఏంటి ఇంతలా మారిపోయాడు?

కళ్ళ చుట్టూ నల్లని వలయాలు. సిగరెట్లు కాల్చి కాల్చి కమిలిపోయిన పెదవులు. వన్నె తగ్గిన ఛాయ, పల్చబడిన వెంట్రుకలు, అక్కడక్కడ మెరిసిపోయిన జుట్టు - ఇదేంటి శ్యామ్ ఇలా అయిపోయాడు?!?

శ్యామ్ నన్ను ఇక్కడ ఊహించలేదేమో కాస్త ఆశ్చర్యంగా "హలో!" అన్నాడు.

మాటలో స్పష్టత లేదు.

ఏమని పలకరించాలో, అతని పలకరింపుకి ఎలా జవాబు చెప్పాలో తెలియని అయోమయంలో నేనుండగానే అమ్మ తాళాలు తీసి శ్యామ్‌కి ఇచ్చింది.

శ్యామ్ వెళ్ళిపోతూ నా వేపు తిరిగి "ఇవాళ ఇక్కడ ఉంటారా, వెళ్ళిపోతారా?" అడిగాడు.

"వెళ్ళిపోతుందట" అంది నాన్నమ్మ.

"మళ్ళీ వస్తాను" శ్యామ్ వెళ్ళిపోయాడు.

"శ్యామ్ ఇప్పుడేం చేస్తున్నాడు?" అడిగాను అమ్మని.

"పి.హెచ్.డి. చేస్తూ మధ్యలో వదిలి రాజకీయాలలోకి వెళ్ళాడు. చదువు పూర్తి చేయలేదు. ఉద్యోగం లేదు. వ్యాపారం లేదు. పైరవీలు చేస్తున్నాడు. పెళ్ళయింది. ఇద్దరు పిల్లలు. ఇంటికి ఎప్పుడు వస్తాడో, వెళతాడో అతనికే తెలియదు. ఇతని ధోరణికే విసిగిపోయిందో, ఆవిడ తరహానే అంతో-ఆమె ఎక్కువగా పుట్టింట్లోనే ఉంటుంది. వైదేహిగారు పెళ్ళికి వెళ్ళారు. ఆలశ్యం అవుతుందేమోనని అతనొస్తే ఇవ్వమని తాళాలు ఇచ్చారు. రాజకీయాలు కదా. పార్టీలు అవీ ఎక్కువ అనుకుంటాను. ఎప్పుడు చూసినా తాగేఉంటాడు" అంది అమ్మ. అన్నం సహించలేదు. శ్యామ్ ఎందుకిలా అయ్యాడు? 'ఐ.ఏ.యస్.ని అయితే ఎలా ఉంటాను?' అని ఒకసారి శ్యామ్ అడిగితే 'కుర్చీకే అందం వస్తుంది' అన్నానోసారి. 'ఖచ్చితంగా ఆఫీసర్‌ని అవుతా' ననేవాడు. క్రమంతప్పకుండా 'యోగ' చేసేవాడు. అటువంటి శ్యామ్ ఇలా అయిపోయాడా?

ఇంటికి బయలుదేరి వెళ్ళిపోదామంటే మళ్ళీ వస్తానన్నాడు. తను రాకుండా వెళ్ళిపోతే బాగుండదు. ఎవరికీ? నాకే!

పదకొండు దాటుతుంటే "వెళతాను" అన్నాను.

"రేపు వెళ్ళు. ఇంత రాత్రి పూట ఏం పోతావ్" అంది నాన్నమ్మ.

"వెళతా. లేకపోతే ఉదయమే హడావుడిగా వెళ్ళాలి" అని పర్సు తీసుకుని బయటికి వస్తున్నాను. "ఆటో ఎక్కిస్తాను" అని నాన్నగారు బయలుదేరుతుంటే శ్యామ్ వచ్చాడు.

వస్తూనే హడివుడిగా, "సారీ! ఎవరో వచ్చారు. ఆలస్యం అయింది. వెళ్ళి పోతున్నావా? నే ఆటో వరకు డ్రాప్ చేయనా?" అన్నాడు.

శ్యామ్ డ్రైవింగ్! ఎంత చక్కగా డ్రైవ్ చేస్తాడో!! చాలా సంవత్సరాల తరువాత తిరిగి అతని డ్రైవింగ్ చూడబోతున్నాను.

"సరే!" అన్నాను.

శ్యామ్ బండి స్టార్ట్ చేశాడు. నేను ఎక్కాను. బేస్‌మెంట్ నుండి

రోడ్డు మీదకి వచ్చి బండి కాస్త దూరం వెళ్ళిందో లేదో అప్పటికి రెండు సడన్ బ్రేక్స్, నాలుగుసార్లు హారన్ మోగటం.

శ్యామ్ చేతుల వేపు చూశాను. చేతివేళ్ళలో వణుకు. తాగుడు, సిగరెట్లు మనిషిని ఎంత అన్‌బ్యాలెన్స్‌డ్‌గా తయారు చేస్తాయో కదా!

అతను డ్రైవింగ్ చూస్తుంటే ఎక్కడ పడేస్తాడోనని భయం వేసింది. ఒకప్పుడు 'లాంగ్ డ్రైవింగ్‌కి తీసుకువెళ్ళవా?' అని సతాయించే నేను ఇప్పుడు ఒక్క నిమిషం కూడా అతని డ్రైవింగ్‌ని భరించలేక పోతున్నాను. భయపడుతున్నాను.

"శ్యామ్! నే డ్రైవ్ చేయనా?" అడిగాను.

శ్యామ్‌కి పరిచయం ఉన్న మైత్రికి డ్రైవింగ్ అంటే భయం.

"బ్యాలెన్స్ చేయగలవా?" అడిగాడు శ్యామ్.

బ్యాలన్స్!

తెరలుతెరలుగా నవ్వొచ్చింది. మూడు నెలలు తనకంటే పెద్దదానినని శ్యామ్ ఆ రోజు తిరస్కరించకపోయి ఉంటే ఈ రోజు నా జీవితానికి 'బ్యాలెన్స్' లేక బాధపడివుండేదాన్ని. ఆటో కనిపించింది. శ్యామ్ బండి ఆపాడు. నేను దిగి ఆటో వేపు వెళ్ళబోతుంటే, "ముప్పయిలో పడినా ఇంకా ఇరవై నాలుగేళ్ళ అమ్మాయిలానే ఉన్నావు. ఇలానే ఉంటావనుకుంటే నిన్నే పెళ్ళి చేసుకునేవాడినేమో. రియల్లీ! యు ఆర్ ఏ 'క్యూట్ గర్ల్' ఐ లవ్ యూ!" అంటూ నా చేతిని తన చేతుల్లోకి తీసుకోబోతుంటే చప్పున ఆటో వేపు కదిలి, "డ్రాప్ చేసినందుకు థాంక్‌యూ" అని చెప్పి ఆటో ఎక్కాను.

రూపంలోనే కాదు-ప్రవర్తనలో, జీవన విధానంలో ముద్దొచ్చే సంస్కారాన్ని శ్యామ్ కోల్పోవటం నన్ను బాధపెట్టింది.

ఎదిగిన ఆలోచనలలో 'క్యూట్‌నెస్' ఉండాలికాని అందంలో, వయస్సులో కాదు కదా!?!

'అతను పెళ్ళి చేసుకోనని తిరస్కరించటం వలన జీవితంలో నేనేం కోల్పోలేదు'- అని డైరీలో రాసుకొని ప్రశాంతంగా నిద్రపోయాను.

